## ఏడుపాయల్లో భక్తుల సందడి



పూజలందుకుంటున్న దుర్గామాత అమ్మవారు

పాపన్నపేట, డిసెంబర్ 8: ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏడుపాయల ఈవో చంద్రశేఖర్, సంబంధిత సిబ్బంది సూర్యశ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వర్ణాచారి, రాజు తదితరులు ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో భక్తులు

## అంత్యక్రియలకు ఎమ్మెల్యే హాజరు



అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, డిసెంబర్ 8: మండలంలోని ఏదులాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకుడు మర్రి మహేందర్‌రెడ్డి తండ్రి మర్రి ప్రతాప్‌రెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి మర్రి మహేందర్‌రెడ్డి దగ్గరి బంధువు. ఆదివారం ప్రతాప్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించడంతో ఎమ్మెల్యే తో పాటు ఆమె కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు హాజరయ్యారు. శివ్వంపేట మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని, సంతాపం తెలిపారు.

## మహాసభలను విజయవంతం చేయాలి: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 8: సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సభలకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు నర్సమ్మ, మల్లేశం, బస్వారాజు, నాగరాజు, సంతోష్, ఆజయ్, ప్రవీణ్, నవీన్, మహేందర్‌రెడ్డి, బాలమణి పాల్గొన్నారు.

## బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత



చిన్నశంకరంపేట, డిసెంబర్ 8: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు సీఈఐఆర్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సై నారాయణ సూచించారు. ఆదివారం చిన్నశంకరంపేటలో పోలీస్ స్టేషన్‌లో సీఈఐఆర్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పట్టుకొని బాధితులు రవీందర్, శ్రీనివాస్, రవితేజ, భానుకు అందించారు.

## ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలి


**– జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు**



చేగుంటలో క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు

చేగుంట, డిసెంబర్ 8: ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలని జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, ఎంపీడీవో చిన్నరెడ్డి పేర్కొన్నారు. చేగుంటలోని ఆదర్శ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ గ్రామ స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే పిల్లలు క్రీడల్లో ప్రతిభ కనబరిచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడానైపుణ్యంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో నరేశ్, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, కోచ్ కరణం గణేశ్ రవికుమార్, పీఈటీలు ఎన్.శంకర్, డీ.శంకర్, మంజులత, శారద, దిలీప్, చల్లా లక్ష్మణ్, స్థానిక నాయకులు నవీన్, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పుస్తెమెట్టెలు అందజేసిన మాజీ జడ్పీటీసీ




శివ్వంపేట, డిసెంబర్ 8: మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన బొగ్గుల లక్ష్మి వేణు దంపతుల కూతురు వైష్ణవి వివాహం ఆదివారం జరిగింది. దీనికి మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా తన సొంత ఖర్చులతో పుస్తె మెట్టెలను మాజీ సర్పంచ్ బొగ్గుల సాలమ్మయాదగిరి, మాజీ ఉపసర్పంచ్ నాయిని వేమారెడ్డి ద్వారా అందజేశారు. సీనియర్ నాయకులు యాదగిరి, కుమ్మరి శంకర్, అశోక్, దొడ్లె ఆంజనేయులు, బాలేశ్, రాములు, భిక్షపతి, సత్యనారాయణ, ఉప్పరి యాదగిరి, నాగభూషణం పెండ్లికి హాజరయ్యారు.

# వామ్మో వానర సైన్యం



నిజాంపేటలో రోడ్డుకు అడ్డంగా ఉన్న వానర సైన్యం



అక్కన్నపేటలో ఇంటిపై కోతుల వీరంగం

- రోడ్డుకు అడ్డంగా వందలాదిగా కోతుల దండు
- కదలని వాహనాలు, భయాందోళనలో ప్రయాణికులు
- రోడ్డుపై కోతుల వీరంగం



రామాయంపేట రోడ్డుపైన కోతుల గుంపు



అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో కోతుల గుంపు

రామాయంపేట, డిసెంబర్ 8: వామ్మో వానర సైన్యం. వందలాదిగా వచ్చి రోడ్డుకు అడ్డంగా కూర్చుంటున్న కోతుల దండు. రోడ్డుకు ఇటు, అటు సైడ్లలో కూర్చుని ప్రయాణికులు వెళ్లకుండా వాహనాలు కదలకుండా వీరంగం చేస్తున్నాయి. రామాయంపేట, నిజాంపేట మండలాల్లోని వివిధ గ్రామాలు, ప్రధాన రహదారులపై కోతులు దాడులు చేస్తున్నాయి. రోడ్డుపై కోతులు చేస్తున్న వీరంగాన్ని ప్రజలు చూస్తున్నారు తప్ప ఏమీ చేయలేక పోతున్నారు. వాటి దగ్గరకు వెళితే మీదపడి కరువడం మొదలు పెడతాయి. అందుకోసం కోతులు వెళ్లేంత వరకు వాటి జోలికి వెళ్లకుండా ఉంటున్నారు. గంట సమయమైనా సరే వాహనాలను నిలిపి అవి వెళ్లిపోయేవరకు వేచిచూస్తున్నారు. రామాయంపేట మండలంలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్, గ్రామంలోనూ కోతులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇంటిపైకి ఎక్కి పెంకులు తీసేసి, నానా హంగామా చేస్తున్నాయి. ఇంత చేసినా ప్రభుత్వం, అధికారులు కోతులను పట్టుకోవడంపై శ్రద్ధ కనబర్చకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు వాపోతులన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని కోతులను వెళ్లగొట్టాలని, లేకుంటే అవి తమ ప్రాణాలను కూడా తీస్తాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మెదక్ చర్చిలో క్రిస్మస్ సందడి



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 8: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి ఆవరణలో క్రిస్మస్ సందడి నెలకొన్నది. సీఎస్ఐ వసతి గృహాల్లో పశువుల పాక, బెత్లేహాం, నజరేతు పట్టణాలు, చర్చి నమూనాలను విద్యార్థులు రూపొందించారు. ఇవి చూపరులను ఆకర్షిస్తున్నాయి. ఆదివారం దూర ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున మెదక్ చర్చికి తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇన్‌చార్జి శాంతయ్య, సీఎస్ఐ కమిటీ సభ్యులు గంట సంపత్, సువణ్‌డగ్లస్, నోబుల్‌సన్, సంశాన్ సందీప్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యగుట్ట మల్లన్నకు పట్నంతో పూజలు



మల్లన్న స్వామికి పట్నం వేసి ప్రత్యేకపూజలు చేస్తున్న భక్తులు

మెదక్ రూరల్, డిసెంబర్ 8: మండలంలోని మంబోజిపల్లి శివారు కొయ్యగుట్ట మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. పూజారి మల్లన్న ఆధ్వర్యంలో మల్లన్నకు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. భక్తులు ఒగ్గు పూజరితో గంగరేగు చెట్టు కింద పట్నం వేసి బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

## చలికాలం.. జరభద్రం!



- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు



జహీరాబాద్, డిసెంబర్ 8: చలికాలం వచ్చిందంటే చల్లని వాతావరణం ఉంటుంది. ఆహ్లాదం మాటున అనారోగ్యాన్ని కూడా తెస్తుంది. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చలికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది టైఫాయిడ్, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు, విషజ్వరాలు సోకే ప్రమాదం ఉంటుంది. తాగునీటి విషయంలో జాగ్రతలు అవసరం.

**వ్యాధుల సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- చలికాలంలో జలుబు, దగ్గు, జ్వరం వస్తే సొంత వైద్యం మానుకుని, వైద్యులను సంప్రదించి, వారి సూచనలు మేరకు మందులు వాడాలి
- కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవడం మంచిది.
- చలికాలంలో చేతుల పరిశుభ్రత ముఖ్యం. ఆ తర్వాతే ఆహారాన్ని తీసుకోవాలి.
- దోమల నివారణ చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా తెరలను వాడటం మంచిది.
- శీతలపానియాలు, ఐస్‌క్రీంలకు దూరంగా ఉండాలి. చిన్నారులకు ఇవ్వకూడదు.
- చిన్నారులకు స్వెటర్లు వేయకుండా ఇంటాబయట తిరగనివ్వొద్దు
- గుండె సంబంధించిన వ్యాధులతో బాధపడే వారు చాలా జాగ్రతగా ఉండాలి.
- జర్కిన్, తలకు హెల్మెట్, మంకీక్యాప్స్, కాళ్లకు షూ, చేతులకు గ్లౌజులు వేసుకోవాలి.

**చలికాలంలో జాగ్రత్తలు తప్పనిసరి**

చలికాలంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారులు, వృద్ధులు, అస్తమా రోగులు, చల్లగాలిలో, మంచుపట్టిన సమయంలో బయట తిరగడం మంచిదికాదు. తప్పని సరి పరిస్థితుల్లో ముఖానికి మాస్కులు ధరించాలి. జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి సోకకుండా జాగ్రత్తలు పాటించాలి. చిన్నారుల శరీరం వెచ్చగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. చలి తీవ్రతతో శ్వాసకోశ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ.



## మాఫీల పేరిట కాంగ్రెస్ నయవంచన

### వట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సంపత్



మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ డైరెక్టర్ సంపత్

అల్లాదుర్గం, డిసెంబర్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరిటతో రైతులను నయవంచనకు గురిచేస్తున్నదని వట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సంపత్ అన్నారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాతూ రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల హామీలో చెప్పిన రేవంత్‌రెడ్డి, గెలిచాక కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రైతుబంధు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. 6 గ్యారంటీలు నెరవేర్చలేదనే సంతోషంలో ఏడాది సంబురాలు జరుపుకొంటున్నారన్నారు. క్వింటాలుకు ఐదు వందల బోనస్ ఇస్తామని ప్రకటించి ఇప్పుడు సన్న వడ్లకే ఇస్తామనడం రైతులకు మోసం చేయడమేనన్నారు. సమావేశంలో రైతు సంఘం అధ్యక్షుడు బగిలి రమేశ్, ప్రధాన కార్యదర్శి కురుమ బేతయ్య, ఉపాధ్యక్షుడు వాలిపాష కంతి, శంకరయ్య, కళాయి వెంకటేశం, తుల్జారాం, విఠల్, నారాయణ, మల్లేశం, బేతయ్య పాల్గొన్నారు.

## గాంధీ ఆశయసాధనకు కృషి చేయాలి: ఎమ్మెల్యే



ఖాజాపూర్‌లో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట, డిసెంబర్ 8: మహాత్మా గాంధీ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తెలిపారు. ఆదివారం మండలంలోని ఖాజాపూర్‌లో మహ్మద్ హుస్సేన్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మహ్మద్ అక్బర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సింగిల్ విం డో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాజిరెడ్డి, రాజాసింగ్, కిష్టయ్య,ఏకే యాదవరావు మాజీ ఎంపీటీసీలు శివకుమార్, పోచయ్య నాయకులు, భిక్షపతి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

## పేకాడుతున్న 11 మంది అరెస్టు



కొల్చారం పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

కొల్చారం, డిసెంబర్ 8: మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఆలయం సమీపంలోని వనదుర్గా రెస్ట్ హోంలో శనివారం అర్ధరాత్రి పేకాడుతున్న వారిపై పోలీస్‌లు దాడి చేశారు. ఈ దాడిలో 11 మంది నిందితులను కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్ అరెస్ట్ చేశారు. ఆదివారం కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి సమావేశంలో వారిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్ధరాత్రి సమయంలో 11 మంది పేకాడుతున్న నిందితులపై దాడి చేసి భారీ మొత్తంలో నగదు, పేకాట కాయిన్స్, మొబైల్ ఫోన్లు పది రూ.49190 సీజ్ చేశారు. పేకాట కాయిన్స్ వివిధ నంబర్లతో కూడిన కాయిన్స్, సుమారుగా రూ.12 లక్షల వరకు, 8 పేక సెట్స్, క్యాస్ కౌంటింగ్ మిషన్, రెండు కార్పెట్స్ స్వాధీనం చేసుకున్నారు. పేకాటకు ప్రధాన నిర్వాహకులుగా వెంకట్‌రెడ్డి, సంతోష్ సింగ్ ఉన్నారు. శ్రీ వనదుర్గా రెస్ట్ హోం యజమని సాయగౌడ్ ఈ పేకాటకు ప్రోత్సాహం ఇచ్చినట్లు తెలిపారు. వీరిపై కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహ్మద్ గౌస్, సిబ్బంది ఉన్నారు.

## చూపరులకు ఆకట్టుకుంటున్న పుంటికాయలు



సాగు చేసిన పుంటికూర పంట

జహీరాబాద్, డిసెంబర్ 8: జహీరాబాద్ సమీపంలోని బాబానగర్ కాలనీలో పంట పొలంలో సాగు చేసిన పుంటికాయలు చూపరులకు ఆకట్టుకుంటున్నాయి. భూమి ఎర్రని రంగేసినట్టు పొలంలో చూడముచ్చటగా ఉన్నవి పూలు అనుకుంటే పొరబడ్డట్టే. ఎందుకంటే పుంటి కూర కాయలు. ఈ మొక్కల ఆకులు రాలిపోవడంతో కాండం నుంచి కాయల వరకు ఎర్రగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నాయి. పొలాల్లో జూన్‌లో విత్తుకుంటే డిసెంబర్‌లో కోతకు వస్తుందని జహీరాబాద్ రంజోల్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ విత్తనాలను మార్కెట్‌లో విక్రయిస్తే వాటి నుంచి నూనె తీసి సబ్బుల తయారీలో వినియోగిస్తారు.

## సైబర్ వలలో మహిళ



మెస్సెజ్ చూపుతున్న బాధిత మహిళ

నిజాంపేట, డిసెంబర్ 8: సైబర్ నేరగాళ్ల మాయలో పడి ఓ మహిళ మోసపోయిన ఘటన నిజాంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందిగామలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన అరుణ తల్లి లక్ష్మి గుండెపోటుతో మృతి చెందిందని నందిగామకు వచ్చింది. ఆదివారం ఉదయం అరుణ ఫోన్‌కు రూ.25 వేల డ్వాక్రా గ్రూప్ లోన్ మంజూరైందని 8929436896 నెంబర్ నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఈ క్రమంలో అరుణ సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌పై క్లిక్ చేయగా వెంటనే రూ.13,500లు తన బ్యాంక్ అకౌంట్ నుంచి మాయమయ్యాయి. బాధితురాలు లబోదిబోమంటూ నిజాంపేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేసింది.

## రేపటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

శివ్వంపేట, డిసెంబర్ 8: రేపటి నుంచి ఈనెల 12వ తేదీ వరకు సీఎం కప్ 2024 మండల స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్‌గుప్తా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రీడలు మండలంలోని గోమారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయని పేర్కొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగా పోటీలను కూడా త్వరలో నిర్వహిస్తామన్నారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికలకు వేర్వేరుగా ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ పంచాయతీ కార్యదర్శిల వద్ద పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

## గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడు మృతి



యేసోబ్ (ఫైల్)

పాపన్నపేట, డిసెంబర్ 8: గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన ఘటన అర్కెల గ్రామంలో జరిగింది. బేగరి యేసోబ్ (29)కు ఆదివారం ఉదయం గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే పాపన్నపేటలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పారిశుధ్య కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

నిజాంపేట, డిసెంబర్ 8: నిజాంపేటలోని పన్యాల శ్రీనివాస్‌రెడ్డి గృహంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో స్వాములు రంజిత్‌గౌడ్, బాల్‌రెడ్డి, రవీందర్, యాదాగౌడ్, రమణ పంతులు, పన్యాల రాజిరెడ్డి ఉన్నారు.

## స్టార్టర్ డబ్బాల చోరీ



చోరీకి గురైన స్టార్టర్ డబ్బా

శివ్వంపేట, డిసెంబర్ 8 : శివ్వంపేటలోని బోరుబావుల నుంచి స్టార్టర్ డబ్బాల చోరీకి దుండగులు పాల్పడ్డారు. శనివారం రాత్రి పలువురు రైతులకు సంబంధించిన బోరుబావుల స్టార్టర్ డబ్బాలు, విద్యుత్ పరికరాలు ఎత్తుకెళ్లారు. యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో బోరుబావులకు సంబంధించిన స్టార్టర్ డబ్బాలు చోరీ చేయడంతో మోటర్లు నడవక రైతులు ఇబ్బందులకు గురువుతున్నారు.

## నల్ల పోచమ్మ ఆలయంలో భక్తుల తాకిడి

కౌడిపల్లి, డిసెంబర్ 8: మండలంలోని తునికి అటవీ ప్రాంతంలో వెలిసిన నల్ల పోచమ్మ దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు శివప్ప, రాజేశ్ అమ్మవారిని పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం పోసి, బోనాలు సమర్పించారు. పలువురు తలనీలాలు సమర్పించుకున్నారు.

## పాదయాత్రలో అయ్యప్పలు

చిలిపిచెడ్, డిసెంబర్ 8: మండలంలోని బండపోతుగల్ గ్రామం నుంచి చాముండేశ్వరీ ఆలయం వరకు అయ్యప్ప స్వాములు పాదయాత్ర ఆదివారం చేశారు. గురుస్వామి ఆంజనేయులు మాట్లాడుతూ నిష్ఠతో నిత్యం అయ్యప్పను స్మరిస్తూ దీక్షలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో స్వాములు లక్ష్మయ్య, బాలు, అనిల్‌కుమార్, ప్రవీణ్ గౌడ్, సిద్దు, మణికంఠ, సతీశ్, పవన్ తదితరులు ఉన్నారు.